క్లుప్తంగా

గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామంలోని యాదవ సామాజిక వర్గీయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, హోమాలు చేపట్టి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

కావలిరూరల్: పట్టణంలోని బుడమగుంట, బాలకృష్ణారెడ్డినగర్‌లోని పేదలకు పుల్లా కనకరత్నమ్మ వర్ధంతి సందర్భంగా సంయుక్తసేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. విశ్రాంత హెచ్‌ఎం. ఎం.అజిత్‌బాబు మాట్లాడుతూ న్యాయవాది పీవీ శివప్రసాద్‌రెడ్డి తల్లి పుల్లా కనకరత్నమ్మ జ్ఞాపకార్థం పేదల ఆకలి తీర్చడం ఎంతో అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చేజర్ల: మండలంలోని కాకివాయి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో 28వ తేదీ మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చేజర్ల విద్యుత్ ఏఈఈ ఏ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అనురాధా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి

బిట్రగుంట: బోగోలు పంచాయతీ మసీదు వీధిలో జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానిక ముస్లింలు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో కావలిలో ఎమ్మెల్యేని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మద్యం దుకాణం కారణంగా ఇబ్బంది పడుతున్నామని, దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంటనే మద్యం దుకాణాన్ని ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సెబ్ అధికారులకు సూచించారు.

ఆరోగ్య సిబ్బందికి శిక్షణ

ఆత్మకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందికి వివిధ రోగాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్యశాఖ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలో విధులు నిర్వహించే సమయంలో ప్రజలకు వివిధ రకాల వ్యాధుల లక్షణాలు, చేయించాల్సిన పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పచ్చిశనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



పచ్చిశనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కలిగిరి: కలిగిరిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో పచ్చిశనగల కొనుగోలు కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, పీఏసీఎస్ చైర్మన్ కాటం రవీంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింట పచ్చిశనగలకు గరిష్ట ధర రూ. 5,350 నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్, సీఈఓ కృష్ణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఇర్మియ, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే సమస్య జటిలం

- చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్న ప్రభుత్వం
- దీనిపై పచ్చమీడియాలో తప్పుడు రాతలు
- స్థానిక ప్రజల మండిపాటు
- అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దశాబ్దాలుగా నివాసాలు ఏర్పరచుకున్న కావలి పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాలను 2018లో చంద్రబాబు పాలనలో నిషేధిత చుక్కల భూములుగా ప్రభుత్వ రికార్డుల్లో మార్చేశారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి పట్టణంలోని 20 నంబర్ సచివాలయం వద్ద సోమవారం స్థానికులు ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలుత స్థానికులు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, తమ పెద్దల నుంచి సంక్రమించిన ఆస్తులైన స్థలాలు, ఇళ్లు నిషేధిత భూముల జాబితాలో పొందుపరచి తమను మానసిక క్షోభకు గురి చేయడమేకాక ఆర్థిక సమస్యల్లోకి నెట్టేశారన్నారు. చంద్రబాబు దుర్మార్గమైన పాలన వల్ల తాము కష్టాలు పడుతున్నామని మండి పడ్డారు. అయితే తమ భూములను నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలిగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూల నిర్ణయాలు తీసుకుంటుంటే.. పచ్చమీడియా తప్పుడు ప్రచారంతో భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగిస్తున్నారని వార్తలు రాయడం నీచమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలను హింసించడమే పచ్చమీడియా లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన అన్యాయాలను, నష్టాలను పూడ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజలకు జరిగే మేలును అడ్డుకోవడం, హింసించడమే పచ్చమీడియా లక్ష్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ప్రతి వర్గం ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క వర్గానికి మేలు జరిగిందో మీకే తెలుసన్నారు. రాబోయే ఎన్నిల సమయంలో టీడీపీ నాయకులు నక్క వినయ విధేయతలు ప్రదర్శిస్తూ, నాటకాలు ఆడుతారని చెప్పారు. ఆ రోజు వారిని తమ ఆస్తులను చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు నిషేధిత భూముల్లో పెట్టి నరకం చూపించిందని నిలదీయాలని పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని ఇంటి స్థలాలను, ఇళ్లను చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో పెట్టడం వల్ల, ఆర్థిక అవసరాలకు అప్పులు పుట్టక ప్రజలు పడుతున్న బాధలు వింటుంటే బాధగా ఉందన్నారు. మన ప్రభుత్వం ఉండడంతోనే అనేక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులతో కలిసి ప్రజలకు మేలు జరిగేలా పనులు చేయిస్తున్నానన్నారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో కలెక్టర్‌కు ఈ సమస్యను త్వరితగతిగా పరిష్కరించమని గట్టిగా చెప్పారన్నారు. స్థానికులను వెంట పెట్టుకొని కలెక్టర్‌ను కలిసి పరిస్థితి తీవ్రతను తెలియజేసే విధంగా తనవంతు ప్రయత్నాలు చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

వచ్చే నెలలో సీఎం కావలికి రాక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల రెండు లేదా మూడో వారంలో కావలి పట్టణానికి రానున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న వాటిని తొలిగించి లబ్ధిదారులకు వాటి డాక్యుమెంట్లు అందజేయడం, పేదలకు భూములు పంపిణీ చేసే కార్యక్రమం చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, కనుపర్తి రాజశేఖర్, ఓఎన్జీసీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీడీఓ ఉత్తర్వులు రద్దు చేయాలని ఆందోళన



వైద్యశాల ఎదుట ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డీడీఓ ఉత్తర్వులు రద్దు చేయాలని సోమవారం వైద్యశాలలో పనిచేసే పలువురు మహిళా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ వైద్యాధికారి ఇక్కడ పనిచేసే సమయంలోమహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురి చేసిన ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి సస్పెండ్‌పై బదిలీ అయ్యారన్నారు. ఆ ఉద్యోగిని మళ్లీ ఇక్కడే వైద్యశాలలో నియమించి, డీడీఓ బాధ్యతలు అప్పగించడం వల్ల తాము విధులు నిర్వహించలేకపోతున్నామని వారు వాపోయారు. మహిళా ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడాలంటే వెంటనే డీడీఓ ఉత్తర్వులు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు గ్రామస్తులు డీడీఓగా ఠాగూర్‌నే కొనసాగించాలని ఆందోళన చేశారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు డిమాండ్



పసుపు నిల్వల వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు

ఉదయగిరి: పసుపు రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సోమవారం పలువురు పసుపు రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఏడాదిగా రైతులు సరైన గిట్టుబాటు ధర లేక, దిగుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎకరాకు రూ.1.30 లక్షల పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేసి నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని సన్మానిస్తు అభినందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన భావన అనే విద్యార్థినిని సోమవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన నివాసంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బోగోలు మండలం బిట్రగుంట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వై.భావన ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో జరిగే ప్రదర్శనకు ఎంపిక కావడంతో అభినందనీయమన్నారు. విద్యార్థిని భావన తయారు చేసిన ప్రాజెక్ట్ పనితీరు, దాని ఉపయోగాలు తెలుసుకుని ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడె ఎం.సుదర్శనం, పాఠశాల హెచ్‌ఎం వై.చెంచులక్ష్మి, ఉపాధ్యాయిని యు.విజయలక్ష్మి, బోగోలు జెడ్పీటీసీ ఎం.కీర్తన, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.రఘు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే చిన్నారుల ఎదుగుదల



అల్లూరు: పోషకాహార కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శశిరేఖ

ఆత్మకూరు: చిన్నారుల శారీరక ఎదుగుదల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషకాహారం అందజేస్తున్నట్లు ఆత్మకూరు సెక్టార్ సీడీపీఓ జైనకుమారి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. హిల్‌రోడ్ ఎస్టీకాలనీ, బీసీకాలనీల్లో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ చిరుధాన్యాలు రక్తహీనతను నివారించడంతో పాటు గర్భిణులకు, కడుపులోని బిడ్డలకు బలవర్ధక ఆహారమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్ రత్నమ్మ, సెక్టార్ కేంద్రం నిర్వాహకులు కె రమణమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆహారం ఎంతో మేలు

చేజర్ల: చిరు ధాన్యాలతో కూడిన ఆహారం పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఎంతో మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ అన్నారు. సోమవారం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాటాడారు. మండలంలోని ఆదూరుపల్లి సెక్టారులో ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో పోషణ్‌పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మహిళా పోలీస్ అనసూయ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.మాధవి, బి.జ్యోతి, బి.కుమారి, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: మండలంలోని తెల్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు సీడీపీఓ జైన్‌కుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ వరకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ శ్రీలత, అనుమసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ కస్తూరి విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అల్లూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ శశిరేఖ అన్నారు. సోమవారం మండలంలోని ఇస్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పరిపాలనలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు మంచి పోషకాహారం అందుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, సర్పంచ్ రంజిత్, నాయకులు వెంకయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు లక్ష్మీ నరసింహం

ఆత్మకూరురూరల్: స్పందనలో ప్రజల నుంచి అందిన వినతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీనరసింహం అన్నారు. స్థానిక తహసీల్దారు సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ రికార్డులు క్రమబద్ధీకరణ, భూ వివాదాల పరిష్కారం తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు అందాయని క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల వీఆర్‌ఓల ద్వారా విచారించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



సోమశిల: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలని అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ తెలిపారు. సోమవారం అనంతసాగరం మండలం రేవూరు ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవికి హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జమ్మ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన ఒకేషనల్ పరీక్షలు

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు తొలిఏడాది పరీక్షలు సోమవారం ముగిశాయి. పట్టణంలోని 4 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వాసుబాబు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు 240 మందికి ఏడుగురు గైర్హాజరు కాగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 223 మందికి 9 మంది, షిరిడీ సాయిరాం కళాశాలలో 258 మందికి ఏడుగురు, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రంలో 214 మందికి 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించండి

సంగం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించాలని అకడమిక్ మానటరింగ్ అధికారి సుధీర్ అన్నారు. సోమవారం మండలంలోని దువ్వూరు, సిద్దీపురం, కోలగట్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాల పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమధానాలు రాబట్టారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాఠశాలల తనిఖీపై పలు సూచనలు చేశారు. అకడమిక్ గైడెన్స్ రికార్డు మెయింటెనెన్స్, విద్యార్థుల రాత అన్నింటిని పరిశీలించారు.

స్పీడ్ లేజర్ గన్‌తో స్పెషల్ డ్రైవ్



సంగం: మండలంలోని పెరమన క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జాతీయ రహదారిపై స్పీడ్ లేజర్ గన్‌తో ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్‌తో వస్తున్న వాహనాలను స్పీడ్ లేజర్ గన్ ద్వారా గుర్తించి చలానాలు విధించారు. ఆయన వెంట ఎస్సై నాగార్జునరెడ్డి ఉన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు



ఆత్మకూరు: ఉద్యోగ విధుల్లో తీవ్ర ఒత్తిడితో వచ్చే అనారోగ్యాలను అడ్డుకునేందుకు ముందుగా పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అభిరామ్ ఆస్పత్రి అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. అభిరామ్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి గుండె సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం రెండో రోజు పలువురు పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎకో, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని, వాడాల్సిన మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్సై శివశంకర్ రావుతో పాటు పలు పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఉదయగిరి: రక్తదానం చేయడంతో ప్రాణదానంతో సమానమని ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, ఎస్సై ప్రభాకర్ అన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల, మెరిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వారు రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల పలు వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుండాలన్నారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

గ్రామాభివృద్ధి కోసమే గడప గడపకు మన ప్రభుత్వం



వెన్నవాడ సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను సర్వే ద్వారా తెలుసుకుని పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని వెన్నవాడ సచివాలయంలో గండ్లవేడు, వెన్నవాడ గ్రామాల పరిధిలోని మజరా గ్రామాలకు సంబంధించి సమీక్ష సమావేశం వెన్నవాడ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన గ్రామాలోల గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కంభంశెట్టి ప్రమీల, వెన్నవాడ, గండ్లవీడు సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, మాముడూరు నరసింహులు, మండల ఏఓ కిషోర్‌బాబు, వెన్నవాడ సొసైటీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, భాను, వీఆర్‌ఓ లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్త ఆర్టీఓ కార్యాలయ భవనానికి శంకుస్థాపన



ఆర్టీఓ కార్యాలయానికి భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిరూరల్: మండలంలోని రుద్రకోటలో నూతన ఆర్టీఓ కార్యాలయ భవనానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుద్రకోటలో జాతీయ రహదారికి ఆనుకుని 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్లతో అన్నీ వసతులతో అధునాతన ఆర్టీఓ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఆర్టీఓ కార్యాలయాన్ని అరకొర వసతులు ఉండే అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, దీంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారన్నారు. అయితే వాహనాల రిజిస్ట్రేషన్ కోసం ఒక దగ్గరికి, డ్రైవింగ్ లైసెన్సులకు మరో చోటుకు తిరిగి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రికి తెలియజేయడంతో కందుకూరు, ఉదయగిరి ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా కావలిలో ఆర్టీఓ కార్యాలయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంతో భూమి పూజ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సుధాకర్, డీఎస్పీ ఎం.వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీ కొండమ్మ, ఎంవీఐ సుందర్, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సన్మానం చేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

కావలిరూరల్: పట్టణంలోని క్రిస్టియన్‌పేట మొదటి లైన్‌లో వైఎస్సార్‌టీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలవడానికి ఉపాధ్యాయులు మాకు ఎంతో సహకరించారని ముందుగా అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, భవిష్యత్‌లో కూడా మీరంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుదర్శన్, రాష్ట్ర నాయకులు కె.జాలిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే మునీర్‌జాన్, జిల్లా కార్యదర్శులు మూర్తి, రాజకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మి బాగుపడ్డోడు లేడు

– ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారురాలికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెలే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: విద్యార్థి జీవితం నుంచే మోసాలు నేర్చుకుని, రాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబు మోసాలు, కుట్రలకు ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తారని, ఆయన్ను నమ్మి బాగు పడ్డోడు రెండు తెలుగురాష్ట్రాల్లో కాగడా పెట్టి వెతికినా ఒక్కడూ కనిపించడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ చిన్నపట్టులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యేను కొనుగోలు చేస్తూ వీడియో, ఆడియా టేపుల ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయి, కేసులో ఇరుక్కుని హైదరాబాద్ నుంచి పారిపోయి కృష్ణా నది కరకట్టపై దాక్కున్న గుంట నక్క చంద్రబాబు అని అన్నారు. ఇక్కడికి వచ్చి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను 23 మందిని సంతలో పశువులను కొన్నట్లుగా కొనుగోలు చేసి మంత్రి పదవులను ఇచ్చిన నీచమైన చరిత్ర చంద్రబాబుది దుయ్యబట్టారు. అలా అమ్ముడు పోయిన ఎమ్మెల్యేలు కనీసం ప్రజల మధ్యలో కూడా లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, క్రాస్ ఓటింగ్ చేయించుకుని అడ్డదారిలో ఒక ఎమ్మెల్సీని గెలిపించుకున్న నీచ రాజకీయ నేత చంద్రబాబు అని చెప్పారు. ఆ నలుగురు ఎమ్మెల్యేలకు కూడా గతంలో అమ్ముడుపోయిన వారికి పట్టిన గతే పడుతుందన్నారు. ఒక ఎమ్మెల్సీ గెలిచినంత మాత్రాన టీడీపీ ఒరిగింది ఏమీ లేదన్నారు. చంద్రబాబు డబ్బుతో అధికారం, పదవులను కొనుగోలు చేసే రాజకీయ వ్యాపారి, దళారీగా ప్రజలు గుర్తించారన్నారు. 2024లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ 175 ఎమ్మెల్యే స్థానాల్లో విజయదుందుబి మోగించబోతుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలకు పది కాలాల పాటు మేలు జరిగే మంచి పనులు చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని ఉన్నారన్నారు. చంద్రబాబు వంటి రాజకీయ వ్యాపారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి రానున్న ఎన్నికలు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

ఆర్థిక స్వావలంబనపై దృష్టి పెట్టండి

ఆత్మకూరురూరల్: పారిశుద్ధ్యంలో భాగంగా జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాల్లో సంపద సృష్టించి గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కరటంపాడు ఎల్‌టీటీ కేంద్రంలో సోమవారం అనంతసాగరం, మర్రిపాడు, ఉదయగిరి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ కార్యాలయం రిసోర్స్ పర్సన్ చల్లా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న స్వచ్ఛసంకల్ప కార్యక్రమం అమలు కోసం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విస్తరణాధికారులు ప్రసాద్, మస్తాన్‌ఖాన్, నరసయ్య, కరటంపాడు సర్పంచ్ రేవతి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, ఎల్‌వీ ప్రసాద్, ఆయా మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.